
# నెవర్...

పుట్టిగుంటి గోపీచంద్



పదకొండు గంటల పన్నెండు నిమిషాలు.

"మేనేజర్‌గారు మిమ్మల్ని పిలుస్తున్నారు!" ప్యూన్ వచ్చి విద్యానంద్‌తో చెప్పాడు.

విద్యానంద్ తలెత్తిచూసి "ఇప్పుడేనా?" అనడిగాడు.

"అవును. వెంటనే క్రెడిట్ ఫైల్ తీసుకుని రమ్మన్నారు" అన్నాడతను.

"సరే వస్తున్నా నువ్వెళ్ళు" అంటూ విసుగ్గా లేచాడు.

అతడు ఫైల్ తీసుకెళ్ళాలా వద్దా అన్న సంశయంలో పడ్డాడు. ఏం ప్రిపేర్ చేశాడని పట్టుకెళతాడు! అందుకే ఒట్టి చేతులు ఊపుకుంటూ సన్నగా విజిల్ వేస్తూ ఆ గదికేసి నడిచాడు.

అతడీ బాంక్‌లో చేరి రెండు నెలలే అయింది. చాలు-ఆ రెండు నెలల సర్వీస్‌లో తన ఎనలేని ప్రతిభను అందరికీ చూపించి అందరిలో ఓ విశిష్ట స్థానాన్ని పొంది 'నాటీ బోయ్'గా పేరు గడించాడు. అంతా అతడ్ని ఇష్టపడేవాళ్ళే.

ఒట్టి చేతులతో లోపలకు వస్తూన్న అతడిని చూసి "ఫైల్ తెమ్మన్నాను కదా!" అని అడిగింది జయంతి సీరియస్‌గా.

అతడు కొంచెం కూడా చలించకుండా "పూర్తి కాలేదు" అని చెప్పి "మీకు రెడ్ టేపిజం గురించి తెలుసు. మనవాళ్ళ తీరుతెన్నుల గురించి తెలుసు. ఇన్ని తెలిసి నన్ను ఫైల్ అడగడం భావ్యమా?" అన్నాడు.

"షటప్! ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?" జయంతి మండిపడుతూ చూసింది.

ఆమె వయసు ముప్పై ఐదు నలభై మధ్యలో వుంటాయి. సన్నటి తార రేఖలా వుండడంతో వయసు పాతికలా అనిపిస్తుంది.

విద్యానంద్ ఆమెను ప్రసన్నం చేసుకోడానికి ప్రయత్నిస్తూ "ఎస్ మేడమ్! మీతోనే మాట్లాడుతున్నాను. ఒక్కసారి ఫైల్ తేలేకపోవడమనేది మీ దృష్టిలో క్రమశిక్షణ లేకపోవడం, నిర్లక్ష్యం కావచ్చు. కానీ నాకదెంత కష్టమో ఆలోచించండి. నన్ను క్షమించమని అడగను. మిమ్మల్ని శిక్షిస్తారా అనీ అడగను......"

ప్రవాహంలా సాగిపోతూన్న అతడి చెత్తవాగుడుకు ఆమె మరింత మండి పడుతూ "ఇడియెట్‌లా బిహేవ్ చెయ్యక. ఎందుకలా వాగుతావు? చెయ్యవలసిన పని చేతకానప్పుడు దేనికీ ఉద్యోగం? మానేసి శుభ్రంగా ఏ గ్రాంఫోన్ రికార్డుల కంపెనీనో పెట్టుకోవచ్చుగా" అంది.

"భలే ఐడియా మేడమ్. వెంటనే లోన్‌కి అప్లై చేస్తా" అనేశాడతను.

జయంతి కళ్ళజోడులోంచి అతడికేసి చూసింది. పాతికేళ్ళ పడుచు కుర్రాడు. ఇప్పుడే యవ్వనంలోకి వస్తూన్న ఏ అమ్మాయికి అతడ్ని చూసినా, అతడి మాటలు విన్నా ఆమె గుండెల్లో గులాబులు పూయించగల మగసిరి వుందతనికి.

# సముద్రం

నిశ్శబ్ద రాగాలతో... నిద్రకు దూరంగా
కెరటాల కరాలు తన ముద్రగా
నురగల పరుగులు లయ విన్యాసంగా
గురగురల గొంతుతో నిరంతరం
నినదించే మహా తర్కవేత్తలా
కొన్ని కోట్ల చినుకుల్ని దాచిన మహా కావ్యంగా
అన్ని వేళలా అలల సంతకాలు చేస్తున్నా
అలసిపోని... అపూర్వ సృష్టి!!

—శిరీష

కానీ తాను అనుభవంతో పండిపోయిన స్త్రీ. ఇంకా పెళ్ళి కాకుండా కన్యగానే మిగిలిపోయిన ప్రౌఢ యువతి.

"నేను నీకింక గంట టైం ఇస్తున్నాను. వెళ్ళి ఫైల్ రెడీ చేసి పట్రా" అంది కాస్త కోపాన్ని తగ్గించుకుని.

విద్యానంద్ కదల్లేదు. అక్కడే నిలబడి ఆమె కళ్ళల్లోకి చూస్తూ నిలబడ్డాడు. అతడి కళ్ళల్లో వున్న ముఖ్యమైన ఆకర్షణ—అతని 'ఐ బాల్స్' చాలా పెద్దవి. అందుకే ఆ కళ్ళల్లోంచి మోహావేశంతో బంధించగల ఆకర్షణ శక్తి దూసుకొస్తుంది.

"గెటౌట్" సాధ్యమైనంతగా కోపాన్ని తెచ్చుకుని చెప్పింది.

విద్యానంద్ మెల్లగా వంగి టేబుల్ మీద రెండు చేతులూ పెట్టుకుని అందులో తన మొహాన్ని వుంచి "రేపు మీరు పింక్ కలర్ చీర కట్టుకుని వస్తారు" అన్నాడు.

వూహించని అతడి మాటలకు ఆమె మరింత మండిపడి "నెవర్! అలాంటిది జరగదు. నువ్వు మర్యాదగా బయటకు పో" తర్జనితో బెదిరిస్తూ చెప్పింది.

అతడు మెరిసిపోయేలా నవ్వి బయటకు వచ్చేశాడు.

** ** **

'పింక్ చీరంట-పింక్ చీర. నేనేమన్నా కాలేజీలో చదువుతూన్న పిల్లనా—అన్నాడు కథాని ఏంచక్కా సింగారించుకుని బయలుదేరడానికి? నా వయసెంత? నా అనుభవమేంటి? ఇవన్నీ మరిచి ఆ కుర్రాడన్న దానికి తీపి తలపులతో కలలు కనడమేనా? నెవర్ - ఈ జయంతి అలాంటి పనెప్పుడూ చెయ్యదు' అనుకుంది జయంతి ఆ రాత్రి విద్యానంద్ గురించి ఆలోచిస్తూ.

మర్నాడు లేచి స్నానం చేసిన తర్వాత వెతికితే ఇస్త్రీ చేసిన చీరలు ఒక్కటీ కనిపించలేదు.

"అమ్మా!" అంటూ అరిచింది.

"ఏంటే?" అంటూ మధ్యలో పనులాపుకుని వచ్చారావిడ.

"నా చీరలేవి?" అనడిగింది.

"అన్నీ ఇస్త్రీకేశానే. ఈ పూటకని ఒక్క చీర అట్టే పెట్టాను."

"ఏదీ?"

ఆవిడ తీసి ఇచ్చింది.

అది చూసి జయంతి మండిపడింది. పింకు కలర్ మీద చిన్న చిన్న లేత పసుపు పువ్వులున్న చీరది. 'దాన్నిగానీ కట్టుకెళితే ఆ కుర్రాడు - ఇంకేమన్నా వుందా? ఆఫీసంతా ఈ పూట స్వీట్లు (కేక్స్) పంచుతూ కూర్చుంటాడు. నెవర్ - ఆ చీర తను చచ్చినా కట్టుకోదు.'

"ఇంకో చీరలేదా?" అంది విసుగ్గా.

"ఏమోనే. చాకలిది వారం తర్వాత నిన్నే వచ్చింది. చీరలన్నీ వుతుక్కి వేసేశాను" అంది.

"పోనీ ఇస్త్రీలేని చీరైనా పర్లేదు. ఇది మాత్రం నే కట్టుకోను" అంది జయంతి మొండిగా.

ఆమె తల్లి చోద్యంగా చూస్తూ "అదేంటే బంగారంలాంటి చీర ఇస్త్రీ చేసి పెడితే పిచ్చి చీర అడుగుతావేంటి? ఏమైంది దీనికి? శుభ్రంగానే వుందిగా?" అంది.

జయంతేం చెబుతుంది! ఆ చీరకేసి మంచ్రదగబ్బను చూసినట్లు చూసి పక్కకు తిరిగి మిగిలిన రెండు పిచ్చి చీరల్లో ఒక నీలం రంగుది కాస్త మంచిదాన్ని తీసుకుంది. ఇంకోటి అంచుల్లో చిరిగిపోయింది. దాన్ని వదిలేసింది.

వెంటనే ఆ చీరను స్వయంగా ఇస్త్రీ చేసింది.

ఇక ఆ చీర కట్టుకుని బాగ్ తీసుకుని బయట స్కూటర్ దగ్గరకు నడిచింది.

స్కూటర్ లోంచి గుడ్డతీసి సీట్ తుడిచి లోపల పెట్టేసి స్కూటర్ వోపక్కకు వంచి పెట్రోల్ లెవల్ పడేలా చేసి 'కిక్' కొట్టింది.

అప్పుడు జరిగింది......

వింత!

** ** **

జయంతి ఎంత అనీజీగా ఫీలయిందంటే ఆ రోజంతా ఆమెకు చెప్పరాని విసుగు,

కోపం, ఆవేశం కలిగాయి.

బాంకులో ఒక్క పని కూడా సరిగ్గా చెయ్యలేకపోయింది.

"మే ఐ కమిన్" బయట విద్యానంద్ గొంతు.

జయంతికి తేళ్ళు, జర్రిలూ పాకినంత పనైంది. 'ఒక కుర్రాడి ముందు తను వోటమా? అదేం చిత్రమో? ఈ రోజే చీరలు లేకపోవడం, చాకలి వారం నుంచి రాకపోవడం, ఆఖరికి స్వయంగా కష్టపడి ఇస్త్రీ చేసుకున్న చీర కూడా మ్యాటర్‌కి పట్టి చిరిగిపోవడం...'

"ఎస్ కమిన్"–గొంతులో విషం పోసుకుంటున్నట్లు మొఖం పెట్టి చెప్పింది.

విద్యానంద్ లోపలికి వచ్చాడు. అతడి చేతిలో పింక్ గులాబీ వుంది. దాని కాడ చాలా పొడవుగా, పట్టుకునే వీలుగా, పట్టుకున్నాక పువ్వు సొగసు స్పష్టంగా కనిపించేలా వుంది.

మగసిరి నిండిన చేతిని ముందుకు చాపి దాన్ని జయంతికి అందించాడు.

జయంతికి అతడ్ని కిందపడేసి ఆ పువ్వు కాడ ముళ్ళున్న వాతలు తేలేలా కొడదామనిపించింది. కానీ బలవంతంగా ఆపుకుని

"ఏంటిది?" అంది.

"మ్యాచింగ్. ఈ పువ్వుగాని మీరు పెట్టుకుంటే పూర్తి అందం వచ్చేసినట్టే" అన్నాడు.

'ఎంత ధైర్యం. నా అందచందాల గురించి ఇతడి పొగడ్తలా? అందులోనూ ఈ వయసులో. అతనికి, తనకూ కనీసం పదేళ్ళ తేడా అయినా వుంటుంది. ఏంటిది? ఎందుకిలా చేస్తున్నాడు? తానిప్పుడు ఇతడ్ని ఖండించకపోతే ప్రేటోగి పోతాడు' అనుకుంది.




"దీన్ని తీసుకుపోయి మీ టేబుల్ దగ్గర పెట్టుకోండి. ఇంకెప్పుడూ ఇలాంటి ప్రయత్నాలకు పూనుకోకండి" అని గట్టి వార్నింగ్ ఇచ్చింది.

"పువ్వు ఇవ్వడం కూడా తప్పేనా? ఒక అందమైన పువ్వును ఒక అందమైన అమ్మాయికి ఇవ్వడంలో ఎక్కడైనా పొరపాటుందా? ఏదైనా అనర్థం జరిగిందా? అరాచకం వుందా? వుంటే చెప్పండి?" అన్నాడతను.

"అనర్థాలు, అరాచకాలు నాకు తెలీవు. ఇలాంటి పిచ్చి చేష్టలు, లాజిక్ వాగుడూ నా దగ్గర పనికిరావు. ఇంకెప్పుడు ఇలాంటి పనులు చేసినా వూరుకోను" అంది.

అతడు మనోహరంగా నవ్వి "నాకు తెలుసు! మీకిష్టమే. కాని పైకి ఇలా కోప్పడుతున్నారు" అన్నాడు.

జయంతికి ఎంత కోపం వచ్చిందంటే ఆవేశంగా లేచి నిలబడి "ఇప్పుడి పేపర్ వెయిట్‌తో నీ బుర్ర పగలటమో, ఫ్యాన్‌తో బయటకు గెంటేంచడమో జరుగుతుంది. ఇచ్చిన గౌరవాన్ని కాపాడుకో. నేనెవరో నువ్వెవరో తెలుసుకుని మెలుగు. నీకు నాకూ నక్కకీ నాగలోకానికి వున్నంత తేడా వుంది. పిచ్చిపిచ్చి ఆలోచనలు, పిచ్చిపిచ్చి వాగుడు కట్టిపెట్టు" అని అరిచింది.

అతడి మొఖంలో వెలుగు తగ్గలేదు.

కళ్ళల్లో నవ్వు తగ్గలేదు.

పై పెదవి సగం మీసంతో కప్పబడిపోయి వుంది. కింద వున్న మరో ఎర్రని పెదవితో గుండె లయను తప్పించేలా నవ్వి "మీరెంత కాదన్నా ఇది నిజం. కావాలంటే మీరీ రోజు నవరంగ్ థియేటర్లో బాల్కనీలో ఇరవై రెండో నెంబరు 'ఎ' రోలో కూర్చుని సెకండ్ షో 'పరిచయ్' సినిమా చూస్తారు" అనేసి వెళ్ళిపోయాడు.

జయంతి అతడు వెళ్ళిన వేపే చాలాసేపు కసిగా చూస్తూ కూర్చుంది. ఆమె మనసు అర్థంకాని భయంతో రెపరెపలాడింది. ఏది ఎందుకు ఎలా జరుగుతుందో అర్థం కాలేదు. 'ఈ రోజు తాను పింక్ చీర కట్టుకొస్తే కట్టుకురాగాక! కానీ అతడన్నట్లు ఆ సినిమాకు మాత్రం వెళ్ళదు – వెళ్ళదంటే వెళ్ళదు – అంతే!'

జయంతి ఆ సాయంత్రం ఇంటికివచ్చి స్నానంచేసి టి.వి. ముందు కూర్చుంది.

ఆమె చెల్లి కూడా వచ్చి కూర్చుంది.

ఎనిమిదైంది. చిత్రహార్‌కి ముందు ఎడ్వర్‌టైజ్‌మెంట్లు ప్రవాహంలా వస్తున్నాయి.

జయంతి మనసు విద్యానంద్ మీదకి పోయింది.

'అతను చెప్పిన దాని ప్రకారం తానింకో గంటన్నర తర్వాత 'పరిచయ్' సినిమా నవరంగ్‌లో చూస్తూ వుండాలి. ఎంత అసంగతమైన పని. తాను, సినిమా అందులోనూ సెకండ్ షో సినిమాకి వెళ్ళడమా? నెవర్' అనుకుంది.

అప్పుడు మోగింది కాలింగ్ బెల్.

జయంతి తల్లి వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా సునంద. జయంతి స్నేహితురాలు. ప్రస్తుతం రాజమండ్రిలో పని చేస్తోంది.

లోపలికి వస్తూ "బాగున్నారా ఆంటీ?" అంటూ జయంతిని చూసి చేతిలోని సూట్‌కేసు కింద పడేసి సుడిగాలిలా వెళ్ళేసి చుట్టేసింది.

జయంతికి సునందని చూడగానే పట్టరాని ఆనందం కలిగింది. ఎక్కడో వున్న తన ప్రాణమే లేచి వచ్చిందా అనిపించినట్లైంది.

వెంటనే ఇద్దరూ కబుర్ల లోకంలో పడ్డారు.

వాళ్ళ స్నేహబంధం తెలిసిన జయంతి తల్లి నవ్వుకుని వాళ్ళకు భోజనాలు సిద్ధం చేసి పిలిచింది.

ఇద్దరూ భోజనం చేశాక సునంద "సినిమాకు పోదామా?" అనడిగింది.

ఒకప్పుడు ఇద్దరూ కలిసి ప్రతి ఆదివారం సినిమాకు వెళ్ళే వాళ్ళు. సినిమా కానీ బాగోకపోతే వాళ్ళు వేరే లోకంలో పడి ఇక ఒకటే కబుర్లు.

జయంతి వెంటనే ఒప్పుకుంది.

ఇద్దరూ బయలుదేరుతుంటే అప్పుడు గుర్తుకొచ్చింది విద్యానంద్ చెప్పిన మాట.

జయంతి ఒక్కసారి ఆలోచించింది. 'అతడన్నది నవరంగ్‌కి కదా? అయినా ఎంత విచిత్రం? అతను సినిమా అనడమేంటి? సునంద రావడమేంటి? ఇలా సినిమాకు అందునా సెకండ్ షోకి బయలుదేరడమేంటి? ఎంత ఆశ్చర్యం!' అనుకుంటూనే నడిచింది.

సునంద పక్క నుండడంతో తిరిగి వెంటనే మరో లోకంలోకి వెళ్ళిపోయింది,

ఇద్దరూ కలిసి అప్సర థియేటర్‌కు వెళ్ళారు.


* * *

చీకట్లో తడుముకుంటూ కూర్చుంది జయంతి. అప్పటికే సినిమా మొదలై పోయింది.

అంత చీకటిలో సినిమా బొమ్మపడే సన్నని వెలుతురులో ఎ.సి. ఇచ్చే చలిలో కూడా జయంతికి చెమట్లు పట్టుకొచ్చాయి.

సినిమా చూస్తోందే కాని మనసు మనసులో లేదు. సునంద చెప్పేదేదీ చెవి కెక్కడం లేదు.

ప్రమిదల ముగ్గు



వి. సుహాసిని : దెక్కటూరు.

‘ఎంత విచిత్రం? తామన్ని సినిమా థియేటర్లు తిరగడమేంటి? ఒక్క దానికీ టిక్కెట్స్ దొరక్కపోవడమేంటి? సునంద బలవంతం చేసి నవరంగ్‌కే తీసుకు రావడమేంటి...’ఒక కుర్రాడి మాటలకు వివశురాలై కుతూహలంతో తను రాకపోయినా గమ్మత్తుగా ఇలా రావడం జయంతికి విచిత్రమనిపించింది.

ఇంటర్వెల్‌లో లైట్లు వెలిగాయి.

జయంతి చప్పున చుట్టూ చూసింది. అతనెక్కడా కనిపించకపోవడంతో నెమ్మదిగా ఊపిరి పీల్చుకుంది. ‘అతనుకానీ తననిక్కడ చూస్తే ఇంకేమైనా వుందా?’ ఆమెకా ఆలోచనే సిగ్గుతో కృంగిపోతున్నట్టుగా అనిపించింది.

ఇంతలో వెనుక నుంచి “హలో” అని వినిపించింది.

జయంతి అదిరిపడి వెనక్కి తిరిగి చూసింది.

విద్యానంద్. సరిగ్గా ఎ.సి. గాలి వచ్చి అతడి మీదే పడుతోంది. ఆ చిరుగాలికే ఒత్తైన అతడి క్రాఫ్ అల్లల్లాడిపోతూ మనసును గిలిగింతలు పెడుతున్నట్టుగా కదులు తోంది.

ఎర్రని వెలుగులో అతడు నవ్వుతూ “మీ సీట్ నెంబర్ ఇరవై రెండు-చూసు కున్నారా?” అన్నాడు.

జయంతి చూసింది. అవును నిజమే. కానీ అదెలా సాధ్యం? కూర్చున్నది కూడా ‘ఎ’ రోనే.

సునంద ‘ఎవరతనని అడుగుతోంది.

జయంతి చెప్పింది. ఈ లోగా సినిమా మొదలైంది. లైట్లు తీసేశారు.

తిరిగి చీకటి.

జయంతి ఆలోచిస్తోంది. ఎంతకీ ఎడతెగని ఆలోచనలు ఒక తీరూ తెన్నూ లేని రూపం దాల్చి మనసును కకావికలం చేస్తున్నాయి. ఇదెన్నటికీ సాధ్యం కానిపని అనిపించింది.

అతడు తనని ప్రేమిస్తున్నాడా?

ఎంత సిగ్గుమాలినతనం?

తనందుకు ఒప్పుకుంటుందా?

ఇద్దరి మధ్యా వయసులో ఎంత తేడా?

ఇదెలా కుదురుతుంది?

జయంతి మనసు లగ్నంచేసి సినిమా చూడలేకపోయింది. ఆమె మనసంతా అక్కడ రేగే భావ పంచలనానికి ఎదురు తిరుగుతోంది.

ఒక్కటే సమాధానం.

‘నె... వ... ర్’

సినిమా అయిపోయాక అంతా బయటకు వచ్చేస్తుంటే ఆగింది జయంతి.

వెనక్కి తిరిగి చూసింది.

అక్కడే ఆమె చూపుల కోసమే అన్నట్టు నిలబడి వున్నాడతను.

సునందకు వాళ్ళిద్దర్నీ చూస్తే చాలా ఆశ్చర్యంగా వుంది. కానీ ప్రస్తుతం తానేమీ జయంతిని అడగదలుచుకోలేదు. ఇంటికి వెళితే అదే చెబుతుంది.

జయంతి విద్యానంద్ దగ్గరకు వెళ్ళి “నీ మనసులో వున్న ఉద్దేశ్యమేంటి?” అనడిగింది.

“చెబితే మీరు ఒప్పుకుంటారా?”

“అది కుదిరేదేనా?” తిరిగి అడిగిందామె.

“ఈ లోకంలో కుదరనిదేది?”

“అయితే నీ ప్రశ్న నాకు తెలుసు. దానికి నా సమాధానం ‘నెవర్’. అది జరగని పని” అంది.

“అంతేనా?” అతను నిరాశగా అడిగాడు. అతడి ముఖంలో జాలి, అమాయకత్వం ఎంతో కల్లోలపరిచేలా వున్నాయి.

జయంతి మెల్లగా నవ్వి అతడికి మాత్రమే వినిపించేలా “రేపు నువ్వు మా ఇంటికి వస్తున్నావు” అంది.

“నిజంగా?” అన్నాడతను ఆనందంగా.

“నిజంగా!” జయంతి కూడా చెప్పింది.

మరుక్షణం విద్యానంద్‌కి ఆనందం ఇంత ఎత్తున లభించేసరికి భరించలేకపోయాడు.

* * *

అతడీ రోజు ఇంటికి వస్తాడు. అతడికి సరైన సమాధానం చెప్పి ఒప్పించాల్సిన బాధ్యత జయంతి మీద వుంది.

జయంతి సునందకు తనకథంతా చెప్పేసింది. ప్రస్తుతం తనకు కొండంత అండ సునంద వుంది. సునంద కూడా అతనికి నచ్చ చెబుతానంది.

‘కానీ అతడికిదేం బుద్ధి? తన వయసెక్కడ? అతడి వయసెక్కడ? ఇదెలా సాధ్యమవుతుంది? అదేగానీ నిజమైన పక్షంలో అందరికీ ఎంత విచిత్రంగా కనబడు తుంది. నెవర్! అలా జరక్కూడదు’ జయంతికి తిరిగి అతడి మీద కోపం, అర్థం చేసుకోలేని అతడి కుర్రతనం మీద ఆమెకు చిరాకు కలిగాయి.

ఈ రోజు ఆదివారం.

‘అతడు ఇంటికి వస్తాడు’ అని ఎదురు చూస్తున్న జయంతి కాలింగ్ బెల్ శబ్దం విని వులిక్కిపడింది.

అతడు వచ్చేశాడు. జయంతికేమిటో ఒక్కసారిగా కంగారు, వణుకు, అన్నీ వచ్చేశాయి. ‘ఈ పరిస్థితిలో అతడికి తాను అన్నీ వివరంగా అర్థమయ్యేలా చెప్పకలదా?

చెప్పినా అతడికి అర్థమవుతుందా... ...’

ఈ లోపల సునంద వెళ్ళి తలుపు తీసింది.

ఒక ఏభై ఏళ్ళు వున్నాయన ముందుగా లోపలకు వచ్చారు.

ఆయన్ని చూసి జయంతి, జయంతితోపాటు ఆమె తల్లి కూడా ఆశ్చర్య పోయారు.

ఆయన జయంతి బాబాయ్. పెళ్ళికాక ముందు దాకా ఆయన ఇక్కడే-అంటే జయంతి నాన్నగారి దగ్గరే వుండేవారు. పెళ్ళయ్యాక వచ్చిన భార్య ప్రభావంతో ఆయన విడిపోయాడు.

ఆ వెళ్ళడం తిరిగి ఇదే కనిపించడం. ఈ మధ్య కాలంలో ఎప్పుడూ ఆయన గురించి కానీ, ఆయన వాళ్ళ గురించి కానీ విని వుండలేదు.

అందుకే జయంతి ఆశ్చర్యంగా చూసి “బాబాయ్! మీరా? బాగున్నారా?” అంటూ అడిగింది.

ఆయన జయంతి కేసి అంతే ఆశ్చర్యంగా చూసి “జయంతీ! ఎంత పెద్ద దానివై పోయావమ్మా?” అన్నారు.

జయంతి తల్లి, “చెల్లాయ్ ఏది మరిదిగారు? పిల్లలంతా క్షేమమేనా?” అని హడావుడి చేసింది.

“మీ చెల్లెలు పనిపోయి సంవత్సరం అయింది. ఒక్కడే కొడుకు. వాడూ వచ్చాడు. బయట స్కూటర్ పార్క్ చేసి వస్తున్నాడు.” అంటూ వెనక్కి తిరిగారు.

జయంతి, సునంద, జయంతి తల్లి అంతా ఆ వెనుక వచ్చే వ్యక్తిని చూడడానికి ముందుకు వంగారు.

అతను

వి... ద్యా... న... ం... ద్...

●